

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

ఆర్టీసీ విలీనంపై కేబినెట్ పంపించిన బిల్లును గవర్నర్ ఆమోదించాలని కోరుతూ కార్మికులు డిపోల ఎదుట ఆందోళన చేశారు. 11లో



ఉలుకూ.. పలుకూ లేదు

జిల్లాలో పాఠశాలల క్రీడలకు మూడేళ్లుగా కార్యాచరణ రూపొందించపోవడంతో క్రీడాకారులు ఆందోళన చెందుతున్నారు. 12లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 34° / 26°

జిల్లాలో ఆదివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

శ్రీవారికి ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీవారి పాదానికి, శ్రీస్వామి వారి విగ్రహానికి శాస్త్రోక్తంగా పంచామృతాలతో అభిషేకం చేశారు. శ్రీవారిని, శ్రీ అలివేలు మంగ, శ్రీపద్మావతి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి నిత్య పూజలు చేశారు. తెలంగాణ – ఏపీ రాష్ట్రాలకు చెందిన పలువుకు భక్తులు శ్రీస్వామి వారిని, శ్రీఅమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం అర్చకులు శ్రీవారికి, అమ్మవార్లకు నిత్య కల్యాణాన్ని జరిపించగా భక్తులు కనుల పండుగగా తిలకించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఈఓ జగన్మోహన్‌రావు, సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాల కోసమే శిక్షణ



మాట్లాడుతున్న డీఈఓ సోమశేఖరశర్మ

కొణిజర్ల: ఈ ఏడాది విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఎఫ్ఎల్ఎన్ శిక్షణ ఉపయోగపడుతుందని డీఈఓ సోమశేఖరశర్మ అన్నారు. కొణిజర్లలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఎఫ్ఎల్ఎన్ ఉపాధ్యాయ శిక్షణా శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి తెలుగు, ఆంగ్లం, గణితంలో ప్రగతి సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులు ధారాళంగా చదవడం, గణిత ప్రక్రియల్లో పట్టు సాధించేలా కృషి చేయాలని సూచించారు. ప్రతిరోజూ సాయంత్రం 3.45 నుంచి 4.15 గంటల వరకు తెలుగు, ఆంగ్లం, గణితంలో మాక్ డ్రిల్ నిర్వహించాలన్నారు. ప్రతి విద్యార్థికి కనీసం 700 ఇంగ్లిష్ పదాలు పరిచయం చేసి వాటి ద్వారా వాక్యాలు తయారు చేయడం నేర్పాలని చెప్పారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి దామాల పుల్లయ్య, ఆర్‌పీలు షేక్ లాల్ సయ్యద్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు స్థాయీ సంఘాల సమావేశం

ఖమ్మం సహకారనగర్ : జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈనెల 7న ఉదయం 10 గంటలకు స్థాయీ సంఘాల సమావేశం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ వి.వి. అప్పారావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సభ్యులతో పాటు అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

జాబ్‌మేళాలో 76 మంది ఎంపిక

ఖమ్మంమయూరిసెంటర్: డీఆర్‌డీఏ–ఈజీఎంఎం ఆధ్వర్యంలో గత నెల 26న నిర్వహించిన జాబ్‌మేళాకు 166 మంది అభ్యర్థులు హాజరుకాగా, 76 మంది ఎంపికయ్యారని డీఆర్డీఓ ఎం.విద్యాచందన తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు శనివారం స్థానిక టీటీడీసీ భవనంలో నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

క్షేత్రస్థాయిలో పర్యటించాలి..

మహిళా సంఘాలకు ప్రభుత్వం అందజేస్తున్న బ్యాంక్ లింకేజీ రుణ బకాయిల వసూళ్లను సీసీ, ఏపీఎంలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిశీలించాలని విద్యాచందన ఆదేశించారు. శనివారం స్థానిక టీటీడీసీ భవనంలో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ.. నెలవారీ లక్ష్యాలకు అనుగుణంగా సిబ్బంది పనులు చేయాలన్నారు. సమావేశంలో అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిణి ఆర్.జయశ్రీ, డీపీఎంలు వి.పద్మావతి, డి.శ్రీనివాసరావు, బి.దర్గయ్య పాల్గొన్నారు.

బీఏఎస్‌కు ముగిసిన లాటరీ ప్రక్రియ

ఖమ్మంమయూరిసెంటర్ : 2023 – 24 విద్యా సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ స్కూళ్ల (బీఏఎస్)లో ప్రవేశానికి శనివారం లాటరీ తీశారు. 1వ తరగతి (డేస్కాలర్), 5వ తరగతి(రెసిడెన్షియల్)లలో ప్రవేశాలకు అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్ అధ్యక్షతన ఈ ప్రక్రియ చేపట్టారు. 1వ తరగతిలో 337 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకోగా, 128 మందిని, 5వ తరగతిలో 399 మంది దరఖాస్తు చేసుకోగా 131 మందిని ఎంపిక చేసినట్లు ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ తెలిపారు.

స్నేహమేరా జీవితం...



నేడు స్నేహితుల దినోత్సవం



- కష్టాల్లో ఆదుకున్నవాడే నిజమైన నేస్తం
- మంచి స్నేహితులను ఎప్పటికీ మరువొద్దు
- సాక్షి, ఎస్‌బీఐటీ ఆధ్వర్యంలో టాక్ షో





మాట్లాడుతున్న గుండాల కృష్ణ

ఖమ్మం సహకారనగర్ : 'సమాజంలో అన్నిటి కంటే గొప్పది స్నేహమే. ఎంతమంది ఉన్నా నేనున్నానంటూ భరోసా ఇచ్చేవారే నిజమైన స్నేహితులు. ప్రతి విషయంలోనూ వెన్నుతట్టి ప్రోత్సహిస్తూ ధైర్యం చెబుతుంటారు. ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి సోషల్ మీడియాల్లో నిత్యం ఎంతోమంది పరిచయం అవుతున్నా.. ప్రత్యక్షంగా పరిచయమయ్యే వారితో కూడిన స్నేహమే మేలు చేయడంతో పాటు ఎక్కువ కాలం నిలుస్తుందనేది కాదనలేని సత్యం. తల్లిదండ్రులు సైతం మంచివారితోనే స్నేహం చేయాలని పిల్లలకు జాగ్రత్తలు చెబుతుంటారు.' అని పలువురు విద్యార్థులు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో శనివారం సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన టాక్ షోలో పలువురు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ.. నిజమైన స్నేహితులను జీవితంలో ఎప్పుడూ మరిచిపోకూడదని అన్నారు. ప్రస్తుతం విద్యార్థులుగా ఉన్నవారు భవిష్యత్‌లో ఎంత ఉన్నత స్థానాల్లో ఉన్నా తోటి స్నేహితులను మరిచిపోవద్దని సూచించారు. తల్లిదండ్రుల తర్వాత స్నేహితులే అండదండగా ఉంటూ భరోసా ఇస్తుంటారని చెప్పారు. ఎవరికీ చెప్పుకోలేని సంఘటనలు, విషయాలు, బాధలు, ఆనందం వంటివి మిత్రులకు మాత్రమే చెప్పగలమని అన్నారు. స్నేహం అనేది వెలకట్టలేనిదని, వృత్తి, ఉద్యోగ రీత్యా ఎంత బిజీగా ఉన్నా మిత్రుల కోసం కొంత సమయం కేటాయించాలని సూచించారు. తాను ఇప్పటికీ అలాగే చేస్తున్నానని చెప్పారు. స్నేహితుల దినోత్సవాని పురస్కరించుకుని సాక్షి మీడియా ఆధ్వర్యంలో టాక్ షో నిర్వహించటం ఆనందంగా ఉందన్నారు.

మంచి ఆలోచనలతో ముందుకు..

స్నేహబంధం అనేది మంచి ఆలోచనలతో ముందుకు సాగాలి. ఒక ఎమోషనల్ ఫీలింగ్‌తో ఏర్పడే బంధం జీవితాంతం కొనసాగాలి. అప్యాయ, ప్రేమానురాగాలు పంచుకోవాలి. ఏ సమయంలోనైనా స్నేహితుడున్నాడనే భరోసా ఉండాలి. మంచి ఆలోచనలతో ముందుకు సాగితే జీవితాంతం ఆనందంగా ఉండొచ్చు.

– ఎస్‌కె.అమర్‌నౌషద్ అలీ, సీఎస్‌ఈ ద్వితీయ సంవత్సరం



స్నేహ బంధం గొప్పది

తల్లిదండ్రుల తర్వాత అంతటి గొప్ప వారు స్నేహితులు. అలాంటి స్నేహితులను అభిరుచులకు అనుగుణంగా ఎంపిక చేసుకోవాలి. ప్రతి విషయాన్ని స్నేహితులతో మాత్రమే చెప్పుకోగలం. ఆనందం, బాధ ఇలా ఏ విషయమైనా ధైర్యంగా మనసు విప్పి చెప్పుకునేది స్నేహితులతోనే. అలాంటి స్నేహబంధం చాలా గొప్పది. రోజంతా సంతోషంగా ఉండడంతో పాటు మనలో చిరునవ్వును చూపించి వెన్నుదన్నుగా నిలిచేది స్నేహితులే.

– ఎన్. ప్రియంవద, సీఎస్‌ఈ ద్వితీయ సంవత్సరం



అదో మధురాను బంధం..

జీవితంలో మధురమైనది స్నేహబంధం మాత్రమే. ఆ బంధం నిజాయితీకి నిలువుటద్దంలా ఉండాలి. మంచీ చెడు ఆలోచించి స్నేహితులను ఎంపిక చేసుకోవాలి. అప్పుడే స్నేహం దృఢంగా ఉంటుంది. స్నేహితులనే వారు మన మంచికోరేలా ఉండాలి.

– మరీదు నిఖమా వైష్ణవి, సీఎస్‌ఈ ద్వితీయ సంవత్సరం



విలువలతో కూడిన బంధం కావాలి

అన్ని బంధాలతో పాటు స్నేహబంధం కూడా గొప్పదే. ఈ బంధం అనేది విలువలతో కూడినదిగా ఉండాలి. వినయం, విధేయత కూడా అవసరం. కష్టాల్లో ఉన్న సమయాల్లో నేనున్నాంటూ స్నేహితుడు ఇచ్చే భరోసా మాటల్లో చెప్పలేనిది. ప్రతి ఒక్కరూ స్నేహితుడిని ఆలోచించి స్నేహితులను ఎంపిక చేసుకుంటే ఆ బంధం జీవితాంతం కొనసాగుతుంది.

– బి.వరసర, సీఎస్‌ఈ ద్వితీయ సంవత్సరం

కేఎంసీలో కాసుల వేట!

- పనులు చక్కబెట్టేందుకు కమీషన్లు
- ఉన్నతాధికారి వద్ద పనిచేసే సిబ్బంది చేతి వాటం
- ట్రేడ్ లైసెన్స్‌లు, మ్యుటేషన్లకు ముట్టజెప్పాల్సిందే

ఖమ్మంమయూరిసెంటర్ : కేఎంసీలో ఔట్ సోర్సింగ్ సిబ్బంది కాసుల కక్కుర్తి నానాటికీ శృతిమించుతోంది. ఏ విభాగంలో పనిచేస్తున్నా ఎంత వస్తుందనే దానిపైనే వీరు దృష్టి సారిస్తున్నారు. వీరి ఆగడాలకు ఉన్నతాధికారులు సైతం అడ్డుకట్ట వేయకపోవడంతో రెచ్చిపోతున్నారు. అందరినీ గుప్పిట్లో పెట్టుకుని కావాల్సిన పనులు చక్కబెట్టించుకుంటున్నారు. ప్రధానంగా ట్రేడ్ లైసెన్స్‌లు, మ్యుటేషన్ వ్యవహారాల్లో వీరు అడిగినంత ముట్టజెప్పాల్సిందే. ఉన్నతాధికారి వద్ద పని చేసే ఓ ఉద్యోగి వీరికి తోడు కావడంతో దోపిడీకి అడ్డూ అదుపు లేకుండా పోతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చేయి తడపాల్సిందే..

కేఎంసీలో ఉన్నతాధికారికి అనుసంధానంగా ఉంటూ పలు విభాగాల పనులను చూసే కంప్యూటర్ ఆపరేటర్లు (ఔట్‌సోర్సింగ్) ఇదే అదనుగా చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ప్రతి పనికీ మామూళ్లు వసూలు చేయడం పరిపాటిగా మారింది. ట్రేడ్ లైసెన్స్‌ల జారీలోనూ ఓ కంప్యూటర్ ఆపరేటర్ తాను చెప్పిందే వేదంగా వ్యవహరిస్తున్నాడనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల క్షేత్రస్థాయి సిబ్బంది ట్రేడ్ లైసెన్స్ కోసం పుట్టకోట ప్రాంతంలోని ఓ దుకాణానికి కొలతలు వేసి సదరు యజమానిని కార్యాలయానికి పంపించారు. అతడి వద్ద ఫీజు తీసుకున్న కంప్యూటర్ ఆపరేటర్ రశీదులు తక్కువకు రశీదు అందించాడు. దీనిని ప్రశ్నిస్తే అంతకంటే ఎక్కువ ఫీజు కట్టాల్సి ఉంటుందని బెదిరిస్తున్నట్లు తెలుస్తోంది. ఐదు రోజుల క్రితం ఓ దుకాణదారుడు దీనిపై కేఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేసేందుకు కార్యాలయానికి రాగా.. అక్కడి వరకు వెళ్లకుండా అడ్డుకున్నారు. మ్యుటేషన్లు చేయాలన్నా చేయి తడపాల్సిన పరిస్థితి నెలకొందనే చర్చ జరుగుతోంది.

ఔట్ సోర్సింగ్ సిబ్బంది పెత్తనం..

కేఎంసీలో ఔట్ సోర్సింగ్ సిబ్బంది పెత్తనం పెరిగిపోయిందన్న విమర్శలు ఉన్నాయి. వీరికి ఉన్నతాధికారి వద్ద పనిచేసే వ్యక్తి సహకారం ఉందని, వీరంతా కలిసి కాసులవేటకు తెరలేపారని సమాచారం. పారిశుద్ధ్య కార్మికుల హాజరు తీసుకునేందుకు ఏర్పాటు చేసిన ఓ డివిజన్‌కు చెందిన బయోమెట్రిక్ మిషన్ పని చేయకపోవడంతో.. కార్మికులు కంప్యూటర్ ఆపరేటర్ వద్దకు తీసుకురాగా.. మిషన్ మీ వల్లే చెడిపోయిందని, మరమ్మతు పేరుతో రూ.7,500 వసూలు చేశాడని సమాచారం. ప్రతి పనిలో సదరు సిబ్బంది దూరి, తామే పనులు చక్కబెడుతున్నట్లు ప్రవర్తిస్తున్నారని, ఉన్నతాధికారిని నమ్మించి కార్యాలయంలో పెత్తనం సాగిస్తున్నారని తెలుస్తోంది. నగరాభివృద్ధిపై గతేడాది కాలంగా రూపొందిస్తున్న బుక్‌లు, కరపత్రాల తయారీ, ముద్రణలోనూ చేతివాటం ప్రదర్శించారనే ఆరోపణలు ఉన్నాయి. రెవెన్యూ విభాగంలోని ఓ కంప్యూటర్ ఆపరేటర్ సైతం ఇలాగే వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇంటి వద్దే మ్యుటేషన్లు, ఇతర పనుల ఫైళ్లను అక్కడే చక్కబెడుతున్నట్లు సమాచారం. ఇదంతా అధికారులకు తెలియకుండానే చేస్తున్నారా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

పార్టీలు.. జల్సాలు..

కమీషన్లు దండుకుంటున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది తరచూ పార్టీలు, జల్సాలు చేసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ఏ విభాగంలో ఎలా కమీషన్లు రాబట్టాలనే విషయాలపై చర్చించుకుంటున్నారని తెలుస్తోంది. దీనిపై కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభిని వివరణ కోరగా.. సిబ్బందిపై వస్తున్న ఆరోపణలపై విచారణ చేస్తున్నామని, కంప్యూటర్ ఆపరేటర్లకు లాగిన్ ఇవ్వొద్దని విభాగాల అధికారులకు సూచిస్తున్నామని తెలిపారు. అక్రమాలు చేసినట్లు నిర్ధారణ అయితే చర్యలు తీసుకుంటామన్నారు.

రెండో రోజు ఆరు దరఖాస్తులు



దరఖాస్తు సమర్పిస్తున్న దృశ్యం

ఖమ్మంక్రైం : నూతన మద్యం ఎక్సైజ్ పాలసీ గెజిట్ నోటిఫికేషన్‌లో భాగంగా జిల్లాలో 122 మద్యం దుకాణాలకు ఈనెల 4 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం అయిన విషయం విదితమే. శుక్రవారం నేలకొండపల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నాలుగు దుకాణాలకు దరఖాస్తులు రాగా, రెండోరోజు శనివారం ఆరు దరఖాస్తులు వచ్చాయి. నేలకొండపల్లి స్టేషన్ పరిధిలోని రాజేశ్వరపురం మద్యం దుకాణానికి నాలుగు, ఖమ్మంలో ఎక్సైజ్ స్టేషన్–1 పరిధిలోని రోటరీనగర్ ప్రాంతంలో గల ఐదో నంబర్ షాపునకు ఒక దరఖాస్తు, పాలేరులో ఒక దరఖాస్తు వచ్చాయి. వైరా, మధిర, ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్ – 2, సింగరేణి పరిధిలోని మద్యం దుకాణాలకు ఇంకా బోణీ కాలేదు. నేడు ఆదివారం సెలవు కావడంతో సోమవారం నుంచి దరఖాస్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుందని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. ఇప్పటివరకు జిల్లాలో ఉన్న మద్యం దుకాణాలకు 8 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కార్యక్రమాన్ని ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేందర్ రెడ్డి పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ స్టేషన్ –1 సీఐ రాజు తదితరులు పాల్గొన్నారు.

'జువైనల్' శిక్షణకు న్యాయమూర్తులు

ఖమ్మంలీగల్: జువైనల్ జస్టిస్ రిఫ్రెషర్ ట్రైనింగ్‌కు ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల జువైనల్ కోర్టు న్యాయమూర్తులు కాసరగడ్డ దీప, సుచరిత వెళ్లనున్నారు. ఈనెల 14నుంచి 19వరకు రాష్ట్ర జ్యుడిషియల్ అకాడమిలో జరిగే శిక్షణలో వీరు పాల్గొంటారని హైకోర్టు రిజిస్ట్రార్ (విజిలెన్స్) ఉత్తర్వులు జారీ చేశారు.

'అమృత్'లో ఖమ్మం!

- రైల్వేస్టేషన్ అభివృద్ధికి భారీగా నిధులు
- నేడు వర్చువల్‌గా పనులు ప్రారంభించనున్న ప్రధాని మోదీ
- మరిన్ని నిధులు కేటాయిస్తే మేలంటున్న ప్రయాణికులు



ఖమ్మం రైల్వే స్టేషన్ ముఖద్వారం



రెండో నంబర్ ప్లాట్‌ఫాంపై దెబ్బతిన్న ఫ్లోరింగ్

ఖమ్మం మామిళ్లగూడెం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రైల్వేపరంగా కీలకమైన ఖమ్మంతో పాటు మరో రెండు రైల్వేస్టేషన్లలో మౌలిక సదుపాయాల కల్పనకు అమృత్‌భారత్ పథకంలో భాగంగా రైల్వే శాఖ రూ.75 కోట్లకు పైగా నిధులు కేటాయించింది. ఈ నిధులతో ఖమ్మంతో పాటు మధిర, భద్రాచలం రోడ్ (కొత్తగూడెం) స్టేషన్లలో ఆధునికీకరణ పనులు చేపట్టనున్నారు. నేటితరం ప్రయాణికుల అవసరాలకు తగ్గట్టుగా రైల్వే స్టేషన్లను ఆధునీకరించేందుకు కేంద్రప్రభుత్వం అమృత్ పథకాన్ని అమలు చేస్తోంది.

నిధులు ఇలా..

ఖమ్మం రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.25.4 కోట్లు కేటాయించారు. అలాగే మధిరకు రూ.25.4 కోట్లు, భద్రాచలం రోడ్ స్టేషన్‌కు రూ.25.4 కోట్లు చొప్పున నిధులు కేంద్రం కేటాయించింది. ఈ నిధులతో స్టేషన్లలో ఎస్కలేటర్లు, వెయిటింగ్ హాళ్లు, వైఫై, ఎగ్జిక్యూటివ్ బోర్డ్‌లు, పార్కింగ్, గార్డెన్, తదితర సౌకర్యాలు కల్పిస్తారు. ఈ విషయమై ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం కాగా.. పనులను ఆదివారం ఢిల్లీ నుంచి ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు.

పెద్ద స్టేషన్‌పై చిన్న చూపు..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అతి పెద్ద స్టేషన్‌గా ఖమ్మానికి పేరుంది. ప్రతి రోజు ఈ స్టేషన్ మీదుగా దాదాపు 250 రైళ్ల రాకపోకలు సాగిస్తాయి. అలాగే, వేల సంఖ్యలో ప్రయాణికులు వచ్చి వెళ్తుంటారు. అయితే, మధిర స్టేషన్‌తో సమానంగా అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడాన్ని పలువురు తప్పుపడుతున్నారు.

అనేక సమస్యలు


ఖమ్మం రైల్వేస్టేషన్‌లో అనేక సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ప్రయాణికులకు సరిపడా టాయిలెట్లు, కుర్చీలు, వెయిటింగ్ రూమ్‌లు లేవు. దీంతో నిలబడి వేచి ఉండాల్సి వస్తోంది. అలాగే, ప్లాట్‌ఫాంపై బండల పగుళ్లతో ఇబ్బంది పడుతున్నారు. ఇవేకాక రెండు ప్లాట్‌ఫాంలపై అదనంగా ఎస్కలేటర్లు ఏర్పాటుచేయాలనే డిమాండ్ వస్తోంది.

అభివృద్ధి పనులకు నేడు శంకుస్థాపన

అమృత్ భారత్ పథకంలో భాగంగా ఆదివారం ఉదయం 9 గంటలకు ఖమ్మం రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులకు వర్చువల్ పద్ధతిలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ శంకుస్థాపన చేస్తారని సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ భరతేష్‌కుమార్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు.

'సౌర'వేగంగా..

- రెండో దశ 240 మెగావాట్ల సామర్థ్యంతో యూనిట్లు
- ఎనిమిది ఏరియాల్లో కొత్త సోలార్ ప్లాంట్లు
- ఉమ్మడి జిల్లా నుంచి రెండు ప్రాంతాలకు స్థానం
- మొత్తంగా 540 మెగావాట్ల విద్యుదుత్పత్తి



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సౌర విద్యుదుత్పత్తిలో సింగరేణి సంస్థ శరవేగంగా ముందుకు సాగుతోంది. నిన్నామొన్నటి వరకు బొగ్గు ఉత్పత్తికే పరిమితమైన సంస్థ తెలంగాణ వచ్చాక విద్యుదుత్పత్తి రంగంలో కాలుమోపింది. ఒకేసారి ఇటు థర్మల్, అటు సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేస్తూ రికార్డులు సృష్టిస్తోంది. అంతటితో ఆగకుండా కర్బన ఉద్గారాల విషయంలో నెట్‌జీరో సంస్థగా నిలిచేందుకు వడివడిగా అడుగులు వేస్తోంది.

ఇప్పటికే 300 మెగావాట్లు

తొలిదశలో తొమ్మిది సోలార్ పవర్ ప్లాంట్లను సింగరేణి సంస్థ నెలకొల్పింది. వీటి మొత్తం విద్యుదుత్పత్తి సామర్థ్యం 300 మెగావాట్లుగా ఉంది. ఇందులో ఇప్పటికే 224 మెగావాట్లను ఉత్పత్తి చేసి, పవర్ గ్రిడ్‌కు సరఫరా చేస్తోంది. మరో 76 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ల నిర్మాణ పనులు చివరిదశకు చేరుకున్నాయి. ఈ క్రమంలోనే రెండో దశకు సింగరేణి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సీఎండీ ఎన్.శ్రీధర్ హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో సూచించారు. రెండో దశలో ఎనిమిది ఏరియాల పరిధిలో 240 మెగావాట్ల సామర్థ్యం గల ఎనిమిది యూనిట్లు నెలకొల్పనున్నారు. ఇప్పటికే ప్లాంట్ల నిర్మాణానికి అనువైన స్థలాలను ఎంపిక చేశారు. వాటిలో ఉమ్మడి జిల్లాలోని ఇల్లెందు, సత్తుపల్లి ప్రాంతాలకు స్థానం దక్కింది. విధివిధానాలు ఖరారు చేసి వచ్చే నెలలో టెండర్లు పిలవనున్నారు. అక్టోబర్‌లో నిర్మాణ పనులు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఏడాదిలోగా విద్యుదుత్పత్తి మొదలుకానుంది.

విద్యుత్ బిల్లులు ఆదా

సింగరేణి సంస్థ పారిశ్రామిక, గృహ అవసరాల నిమిత్తం ఏటా 750 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను జెన్‌కో నుంచి కొనుగోలు చేస్తోంది. యూనిట్‌కు రూ.8 చొప్పున ఏడాదికి రూ.600 కోట్లు చెల్లిస్తోంది. సింగరేణి ఉత్పత్తి చేస్తున్న 224 మెగావాట్ల విద్యుత్‌ను పవర్‌గ్రిడ్‌కు అందిస్తుండగా, పవర్ షేరింగ్ విధానంలో రూ.300 కోట్ల వరకు బిల్లులు ఆదా అవుతున్నాయి. త్వరలో అందుబాటులోకి వచ్చే 76 మెగావాట్లు, కొత్తగా నిర్మించే 240 మెగావాట్లతో కలిపితే సోలార్ విద్యుత్ సామర్థ్యం 540 మెగావాట్లకు చేరుకుంటుంది. తద్వారా జెన్‌కో నుంచి సింగరేణి తీసుకునే విద్యుత్ కంటే, జెన్‌కోకు సింగరేణి సరఫరా చేసే విద్యుత్తే ఎక్కువగా తేలుతుంది. దీంతో సింగరేణికి విద్యుత్ బిల్లులు చెల్లించాల్సిన పని ఉండదు. అంతేకాకుండా నెట్ జీరో కార్బన్ ఎమిసేషన్ కంపెనీగా నిలవడానికి అవకాశం కలుగుతుంది.

మిల్లర్లకు స్థలం ఇవ్వండి

అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

ఖమ్మం సహకారనగర్ : జిల్లాలోని మిల్లర్లు ఇవ్వాల్సిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను సకాలంలో ఇచ్చేందుకు సుముఖంగానే ఉన్నారని, అందుకు కావాల్సిన స్థలాన్ని ఇవ్వాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ అన్నారు. శనివారం ఆయన ఎఫ్‌సీఐ గోడౌన్‌లో అధికారులతో మాట్లాడారు. సమయం రెండు నెలలే ఉన్నందున స్థలం చూపించాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ పద్మజ, డీఎం సోములు, ఏఎంటీ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

బొమ్మెరకు టికెట్ ఇస్తే గెలిపిస్తా



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

మధిర: రాష్ట్రంలో రాజకీయ సమీకరణలు ఎలా ఉన్నప్పటికీ మధిర నియోజకవర్గంలో బీఆర్ఎస్ తరఫున బొమ్మెర రామ్మూర్తికి టికెట్ ఇస్తే గ్రామగ్రామాన తిరిగి ప్రచారం చేసి రామ్మూర్తి గెలుపు కోసం పనిచేస్తానని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. ఈ నెలలో హైదరాబాద్‌లో జరగబోయే మాదిగ విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం మధిర పట్టణంలోని శ్రీరస్తు కల్యాణ మండపంలో జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మంద కృష్ణమాదిగను మర్యాదపూర్వకంగా కలిసేందుకు వెళ్లిన రామ్మూర్తిని ఉద్దేశించి మంద కృష్ణమాదిగ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ తదితర పార్టీలు మధిరలో మాలలకే టికెట్లు కేటాయిస్తున్నాయని తెలిపారు. మధిర నియోజకవర్గంలో మాదిగ జాతి ఓట్లు ఎక్కువగా ఉన్నాయని, తెలంగాణ ఉద్యమంలో పాల్గొని, కేసీఆర్‌కు అండగా నిలిచిన బొమ్మెర రామ్మూర్తికి రాబోయే ఎన్నికల్లో ఆ పార్టీ టికెట్ కేటాయిస్తే రాజకీయ సమీకరణలను పక్కనపెట్టి అతని గెలుపు కోసం ప్రచారం చేస్తానని తెలిపారు.

క్లుప్తంగా

సుప్రీంకోర్టు తీర్పు బీజేపీకి చెంపపెట్టు

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్



దుర్గాప్రసాద్‌కు కేక్ తినిపిస్తున్న నాయకులు

ఖమ్మంసహకారనగర్: ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు, ఎంపీ రాహుల్ గాంధీపై సూరత్ కోర్టు విధించిన తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించడం బీజేపీ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని, అశాంతి, ద్వేషంపై ప్రేమ, శాంతి గెలిచాయని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ అన్నారు. శనివారం కాంగ్రెస్ కార్యాలయం వద్ద పార్టీ శ్రేణులతో కలిసి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచి, బాణసంచా కాల్చారు. అనంతరం పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ హాత్ సే హాత్ జోడోయాత్రతో కాంగ్రెస్‌కు, రాహుల్‌గాంధీకి పెరుగుతున్న ఆదరణ చూడలేక బీజేపీ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరించిందన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు, పుచ్చకాయల వీరభద్రంతోపాటు నాగండ్ల దీపక్‌చౌదరి, వడ్డెబోయిన నరసింహారావు, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, దొబ్బల సౌజన్య, మంజుల, అమర్జహన్ బేగ్, లకావత్ సైదులునాయక్, రఫీదా బేగం, చోటాబాబా, మిక్కిలినేని నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రైల్వే గేట్ మూసివేత

కారేపల్లి: కారేపల్లి – ఇల్లెందు ప్రధాన రహదారిలో కారేపల్లి వద్ద ఉన్న 2కే రైల్వే గేటును ఈ నెల 6వ తేదీ (ఆదివారం) నుంచి 13వ తేదీ (ఆదివారం) వరకు వారం రోజులు పాటు మూసివేస్తున్నట్లు రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే గేటు వద్ద ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేస్తున్నందున వాహనాలను కారేపల్లి – పేరుపల్లి రైల్వే గేటు ద్వారా దారి మళ్లించనున్నట్లు పేర్కొన్నారు. కారేపల్లి నుంచి ఇల్లెందు వెళ్లాల్సిన వాహనదారులు కారేపల్లి – పేరుపల్లి రైల్వే గేటు ద్వారా భీక్యాతండా, సూర్యతండా, ఎన్‌టీఆర్‌నగర్, అప్పాయిగూడెం మీదుగా ఇల్లెందు చేరుకోగలరని తెలిపారు.

'తొలిమెట్టు'తో నైపుణ్యాలు పెరుగుతాయి..



విద్యార్థులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

బోనకల్: తొలిమెట్టు శిక్షణతో ఉపాధ్యాయుల్లో నైపుణ్యాలు పెరుతాయని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న తొలిమెట్టు శిక్షణ కార్యక్రమానికి హాజరై ఆయన ప్రసంగించారు. అనంతరం మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు జెడ్పీచైర్మన్‌కు వినతిపత్రం అందించారు.

దేశంలో వట్టిపోతున్న ఉపాధి రంగం



మాట్లాడుతున్న ధర్మేంద్ర

ఖమ్మంమయూరిసెంటర్: దేశంలో పాలకుల నిర్లక్ష్యం, ముందు చూపుతనం లేని కారణంగా ఉపాధి కల్పన రంగాలు వట్టిపోయాయని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర ఆరోపించారు. ఉద్యోగ, ఉపాధి రంగాలకు సంబంధించి పాలకులు ఇచ్చిన ఏహామీని నెరవేర్చలేకపోయారని దీంతో నిరుద్యోగం గణనీయంగా పెరిగిందన్నారు. ఏఐవైఎఫ్ ఖమ్మం జిల్లా కౌన్సిల్ సమావేశం శనివారం సంఘం జిల్లా అధ్యక్షులు మహ్మద్ గౌస్‌పాషా అధ్యక్షతన గిరిప్రసాద్‌భవన్‌లో జరిగింది. ధర్మేంద్ర మాట్లాడుతూ ఉద్యోగ విరమణలే కానీ, ఉద్యోగ కల్పన లేని పాలనలో తొమ్మిదేళ్లలో నిరుద్యోగం రెండు రెట్లు పెరిగిందని తెలిపారు. ఉపాధి లేకపోవడంతో యువత నైరాశ్యంలోకి వెళ్తోందని, ఇది భవిష్యత్ భారతానికి మరింత ప్రమాదమని ఆయన హెచ్చరించారు. సమావేశంలో ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ సిద్ధినేని కర్ణకుమార్, జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, మద్దోజు శ్రావణ్, గనాపారపు ఉపేందర్, భూక్యా రవీందర్, మల్లెబోయిన ఉపేందర్, ఎం.యుగంధర్, మామిళ్ల శ్రీనాథ్‌రెడ్డి, కోటేశ్వరరావు, కొల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కూలీ మృతి

సత్తుపల్లిరూరల్: బోరుబావి పనికి వెళ్లిన ఓ కూలీ ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. సత్తుపల్లి మండలం గంగారం గ్రామానికి చెందిన చిమట వెంకటేశ్వరరావు(50) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చింతలపూడి మండలం వెంకటాద్రిగూడెం గ్రామంలో బోరు వేసేందుకు కూలీగా వెళ్లాడు. బోరు వేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారీ బోరు బెల్ట్ మిషన్‌లో పడటంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిసింది. మృతుడికి భార్య హైమావతి, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

మేమున్నామనీ..



సరదాగా గడిపేందుకు ఆ మిత్రులంతా ఒక చోట కలుసుకునేవారు. గతంలోని జ్ఞాపకాలను నెమరు వేసుకునేవారు. వర్తమానంలోని జరుగుతున్న ఘటనలను పంచుకునేవారు. ఇలాగే ఉండిపోకుండా భవిష్యత్‌లో ఏదో ఒకటి చేయాలని నిర్ణయించుకున్నారు. అనుకున్నదే తడవుగా ఓ బృందంగా ఏర్పడ్డారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తున్నారు. కష్టంలో ఉన్నవారికి చేదోడువాదోడుగా ఉంటున్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారికి ఉపాధి కల్పిస్తున్నారు. ఆకలితో ఉన్నవారికి నిత్యావసరాలు అందిస్తున్నారు. విద్యార్థులకు సైకిళ్లు, నోట్‌బుక్స్ ఇస్తున్నారు. ఇలా.. సమాజసేవలో తమవంతు పాత్ర పోషిస్తూ ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారు.. ఆ స్నేహితులు..

–సాక్షినెట్‌వర్క్

అండగా ఉండాలని..

- స్నేహితురాలి ఉపాధికి రూ.50 వేలు వితరణ
- పాఠశాలకు రూ.2.50 లక్షలతో వేదిక నిర్మాణం
- జిల్లా ఉద్యాన అధికారి అనసూయ చొరవతో స్నేహితుల సమాజ సేవ



పాఠశాలలో నిర్మించిన వేదికపై అనసూయ, ఆమె స్నేహితులు

ఖమ్మంవ్యవసాయం: సమాజ సేవ చేసేందుకు స్నేహితులను ఏకం చేశారు జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి జి.అనసూయ. పాఠశాల విద్య నుంచి స్నేహితులుగా ఉన్న వారితో సెలవు రోజుల్లో సరదాగా గడుపుతున్న ఓ సమయంలో సమాజ శ్రేయస్సు కోసం కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించుకున్నారు. అందుకోసం జిల్లా ఉద్యాన అధికారి అనసూయ ప్రణాళిక రచించి ముందుగా తాము చదువుకున్న పాఠశాలలో ప్రతీ కార్యక్రమానికి అవసరమైన వేదికను నిర్మించాలని ముందుకొచ్చారు. అంతా కలిసి రూ.2.50 లక్షలను జమ చేసి తాము చదువుకున్న అగ్రహారం పాఠశాలలో వేదికను నిర్మించి గ్రామస్తులు, ఉపాధ్యాయులతో ప్రశంసలు పొందారు. వరలక్ష్మి అనే స్నేహితురాలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటంతో పాటు ఉపాధిలేకపోవడంతో రూ.50 వేలతో ఫ్యాన్సీ షాపును పెట్టించారు. ఆ షాపు నిర్వహణతో వరలక్ష్మి కుటుంబం ఉపాధి పొందుతోంది. ఆ స్నేహబృందంలో ఎస్.శ్రీదేవి, కె.సత్యవాణి, డి.దీక్షిత్‌కుమార్, డి.రామకృష్ణ, సుబ్బరాజు, రామరాజు, ఆర్.వెంకటేశ్వర్లు, వరలక్ష్మి తదితరులు ఉన్నారు.

'వి ఆర్ విత్ యూ'..

తలసేమియా చిన్నారులు, పేదలను ఆదుకుంటున్న స్నేహితులు




నిత్యావసరాలను అందజేస్తున్న స్నేహితుల బృందం

ఖమ్మంమయూరిసెంటర్: వ్యక్తులుగా వేర్వేరు స్వభావాలు, ఆలోచనలు ఉన్నా.. స్నేహితులుగా సేవ చేయాలనే ఒకే ఆలోచనతో ఖమ్మం యువకులు అడుగులు వేస్తున్నారు. పేరం బోస్ అనే యువకుడు.. కరోనా సమయంలో ఆకలితో అలమటిస్తున్న పేదలకు సాయం చేయాలనే నిర్ణయాన్ని తన స్నేహితులు చిలకల సాయి, షేక్ మాలిక్, వీర్ల రవికుమార్‌తో పంచుకున్నాడు. వారంతా కలిసి పేదలకు నిత్యావసరాలు, భోజనం అందించడం లాంటి కార్యక్రమాలు ప్రారంభించారు. అదే సమయంలో తలసేమియా చిన్నారులు రక్తం కోసం ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకుని తమ ఇతర స్నేహితుల్లో చైతన్యం కలిగించి రక్తదాన శిబిరాలను నిర్వహించారు. తన స్నేహితులతో కలిసి బృందంగా ఏర్పడిన బోస్ 'వి ఆర్ విత్ యూ'ఫౌండేషన్ పేరుతో మూడేళ్లుగా సేవా కార్యక్రమాలు చేస్తూ వస్తున్నారు. ములుగు జిల్లా సానంపేట గ్రామంలో పేదలకు రూ.70 వేల విలువైన సరుకులను పేదలకు అందజేశారు. ఇక ఖమ్మంలో తలసేమియా చిన్నారుల కోసం ఇప్పటి వరకు 400 ప్యాకెట్ల రక్తదానం చేశారు. పేరం బోస్ (ఓ పాజిటివ్) 26 సార్లు, చిలకల సాయి (బీ నెగిటివ్) 30 సార్లు రక్తదానం చేసి తమ స్నేహితులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

స్నేహం మరువలేనిది..

–డి.మధుసూదన్‌నాయక్, అదనపు కలెక్టర్, ఖమ్మం



తల్లిదండ్రుల తర్వాత అంతటి వారు స్నేహితులే. ఎన్ని కష్టాలు వచ్చినా.. మనం ఎవరికి చెప్పుకోలేని విషయాలను స్నేహితులకు మాత్రమే చెప్పుకోగలం. ఏదైనా ఇబ్బందుల్లో ఉన్నప్పుడు మేమున్నామని భరోసానిచ్చేది స్నేహితులే. నాకు చాలా మంది స్నేహితులున్నారు. అనేక మంది అమెరికా, లండన్ తదితర ప్రాంతాల్లో ఉన్నారు. మేం దసరా పండుగ సమయంలో మిర్యాలగూడెంలో జరిగే జమ్మిచెట్టు వద్ద ఉత్సవాల్లో ఎంతో ఆనందంగా పాల్గొంటాం. ఒకరికొకరం ఉన్నామనే భావన సంతృప్తినిస్తుంది.

–ఖమ్మంసహకారనగర్

సమాజ సేవలో 'మిత్రా గ్రూప్'

- వ్యాపార లాభంలో 10 శాతం సమాజ సేవకు
- 10 ఏళ్లుగా రూ. 2 కోట్లతో సేవా కార్యక్రమాలు



నోట్ బుక్స్ కోసం రూ.5 లక్షల చెక్కు మంత్రి పువ్వాడకు అందిస్తున్న ప్రవీణ్‌కుమార్, బృందం



విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న మిత్రా గ్రూప్ సభ్యులు

ఖమ్మంగాంధీచౌక్: స్నేహితులుగా ఉన్న వ్యాపారులు 'మిత్రా గ్రూప్'గా ఏర్పడి సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఖమ్మం నగరంలో వివిధ రంగాల్లో వ్యాపారాలు చేస్తున్న 18 మంది మిత్రులు 2013లో మిత్రా గ్రూపును ఏర్పాటు చేసి ప్రముఖ వ్యాపారి కురువెళ్ల ప్రవీణ్‌కుమార్‌ను చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఈ గ్రూపులో ఉన్న వ్యాపారులు తాము చేసే వ్యాపారాల్లో వచ్చే లాభంలో 10 శాతం సమాజ సేవా కార్యక్రమాలకు వెచ్చించాలని నిర్ణయించుకున్నారు. ఏటా ఓ ప్రణాళికతో సేవా కార్యక్రమాలు చేస్తారు. 10 ఏళ్లుగా ఈ మిత్రా గ్రూపు రూ.2 కోట్లతో సేవా కార్యక్రమాలు చేపట్టింది. రూ.1.50 లక్షల విలువైన వాటర్ ప్లాంట్లను ఖమ్మం నగరంలోని 32 ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేశారు. విద్యార్థులకు 500 సైకిళ్లను పంపిణీ చేశారు. మహిళలకు 250 కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. గత ఏడాది భద్రాచలం వరద బాధితులకు మంత్రి అజయ్‌కుమార్ చేతుల మీదుగా రూ.11 లక్షలు ఆర్థిక సాయం చేశారు. పలు సందర్భాల్లో ఖమ్మం నగరంతో పాటు, వివిధ ప్రాంతాల్లో ఉన్న అనాథలు, వికలాంగులు, కళారంగాల వారికి సహాయ, సహకారాలను అందించారు. వృత్తిపర నైపుణ్య తరగతులను నిపుణులతో నిర్వహిస్తున్నారు. వినోద, విహార యాత్రలను కూడా ఈ గ్రూపు నిర్వహిస్తుంది.

ఈ గ్రూపులో చెరుకూరి యుగంధర్, రంగా శ్రీనివాస్, పాలవరపు శ్రీనివాస్, చారుగండ్ల రవికుమార్, బొమ్మిడి సునీల్, మహంకాళి వెంకటనగేశ్, మాటేటి నాగేశ్వరరావు, బత్తిని నర్సింహారావు, ఆత్మకూరి రామారావు, డాక్టర్ నర్సింహారావు, కె.అనిల్, మైనేని శ్రీధర్, మైలవరపు సతీశ్, అర్వపల్లి రాఘవ, ఎం.ఉపేందర్ తదితరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ శనివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలతో పాటుగా దివ్యాంగుల కోసం వినియోగించే ర్యాంప్‌లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లోని సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేశ్, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

కుప్పకూలిన కల్వర్టు

తప్పిన ప్రమాదం



కారేపల్లి - పేరుపల్లి ప్రధాన రహదారిపై కూలిన కల్వర్టు

కారేపల్లి: మండలంలోని కారేపల్లి – పేరుపల్లి ప్రధాన రహదారిపై మల్లన్నగూడెం మూలమలుపు వద్ద ఉన్న కల్వర్టు శనివారం ఉదయం కుప్పకూలింది. బయ్యారం మండలం నుంచి కారేపల్లి వైపు ఇటుకలోడుతో వస్తున్న ట్రాక్టర్ వెళ్లిన అనంతరం ఒక్కసారిగా కల్వర్టు కూలింది. ట్రాక్టర్ కల్వర్టు దాటిన తర్వాత కూలిపోవటంతో ప్రమాదం తప్పినట్లయింది. ఇదిలా ఉండగా.. కల్వర్టు కూలిపోయిన కొంత సమయం ముందు ఆర్టీసీ బస్సు కూడా ఇదే మార్గం ద్వారా మాధారం వైపు వెళ్లింది. ఈ విషయం తెలుసుకున్న బస్సులోని ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. కల్వర్టు కూలడంతో వాహనాల రాకపోకలకు శనివారం సాయంత్రం వరకు అంతరాయం ఏర్పడింది. మాధారం, పేరుపల్లి, జమాళ్లపల్లి, గుంపెళ్లగూడెం, చిన్నకట్టుగూడెం గ్రామాల నుంచి ప్రజలు కారేపల్లి వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు. ఇదిలాఉండగా.. కల్వర్టు శిథిలావస్థకు చేరుకుందని, మరమ్మతులు చేయాలని పలుమార్లు ఆయా గ్రామాల ప్రజలు సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కల్వర్టు కుంగిపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తాత్కాలిక మరమ్మతులు..

ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోలేదని చెబుతూ స్థానిక ప్రజాప్రతినిధులు జేసీబీతో కూలిపోయిన కల్వర్టు శిథిలాలను తొలగించారు. తాత్కాలికంగా మొరం పోయించి ద్విచక్రవాహనాలు, ఆటోలు వెళ్లేవిధంగా పనులు చేపట్టారు. కారేపల్లి ఎస్ఐ పుష్పాల రామారావుతో పాటు వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, సర్పంచ్‌లు అజ్మీర నాగేశ్వరరావు, బాణోతు పద్మామోహన్, ఆయా గ్రామాల యువకులు పనులను పర్యవేక్షించారు.

ఈ భోజనం మాకొద్దు..

ఇంటికి వెళ్లిన విద్యార్థులు



పాఠశాలలో ఆడుకుంటున్న విద్యార్థులు

ఏన్కూరు: మధ్యాహ్న భోజనం ఏమాత్రం బాగా లేదని విద్యార్థులు ఇంటికి వెళ్లిన ఘటన మండలంలోని నాచారం ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. పాఠశాలలో 56 మంది విద్యార్థులున్నారు. వారికి కొన్ని రోజులుగా మధ్యాహ్న భోజనంలో ఒకే కూర పెడుతున్నారని, వారానికి ఒక గుడ్డు ఇస్తున్నారని, ఇద్దరు వర్కర్లకుగాను ఒకరే విధులకు హాజరవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ శనివారం బడికి వచ్చిన విద్యార్థులు ఇంటికి తిరిగివెళ్లారు. ఆరుగురు విద్యార్థులు మాత్రమే మిగిలారు. విషయం తెలిసి సీఎంఓ రాజశేఖర్, ఏంఈఓ జయరాజు పాఠశాలకు వచ్చి వివరాలు సేకరించారు.

అటవీ అధికారులు, పోడుదారుల మధ్య వాగ్వాదం



ఘర్షణ పడుతున్న పోడుసాగుదారులు, అటవీ అధికారులు

కొణిజర్ల: మండలంలోని ఎల్లన్ననగర్ అటవీ ప్రాంతంలో శనివారం పోడు సాగుదారులకు, అటవీ అధికారులకు మధ్య వాగ్వాదం జరిగింది. ఎల్లన్ననగర్‌సులు 2018లో సుమారు 20 హెక్టార్లభూమిలో కొత్తగా పోడుసాగు చేస్తున్నారు. గతఏడాది ప్రభుత్వం పోడు సాగుదారులకు పట్టాలిస్తామని ప్రకటించడంతో ఎల్లన్ననగర్‌వాసులు కూడా దరఖాస్తు చేసుకున్నారు. అయితే, 2005 తర్వాత కొత్తగా పోడు కొట్టిన వారికి పట్టాలు ఇవ్వొద్దని ప్రభుత్వం చెప్పింది. ఎల్లన్ననగర్‌వాసులు కొత్తగా సాగు చేస్తున్న 20 హెక్టార్ల భూమి అప్పగిస్తేనే సర్వే చేయిస్తామని అటవీ అధికారులు చెప్పారు. ఎల్లన్ననగర్ వాసులు తిరస్కరించారు. సర్వే ఆగింది. దీంతో రెండు వారాలుగా పోడు సాగుదారులకు, అటవీ అధికారులకు చర్చలు జరుగుతున్నాయి. శనివారం ఎఫ్ఆర్ఓ రాధిక నేతృత్వంలో అటవీ సిబ్బంది తమపరిధిలో అటవీ భూమికి ట్రెంచ్ కొట్టించేందుకు జేసీబీలతో వెళ్లారు. ఎల్లన్ననగర్‌వాసులు వాహనాన్ని అడ్డుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సర్వే చేసి తమకు భూముల పట్టాలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. కొత్తగా సాగుచేస్తున్న భూమిని అప్పగిస్తేనే సర్వేకు సహకరిస్తామని అటవీ అధికారులు చెప్పడంతో వాగ్వాదం జరిగింది.

మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకే ఏకరూప పౌరస్మృతి

ఖమ్మంమయూరిసెంటర్: దేశంలోని విభిన్న మతాల, సంస్కృతుల, జాతుల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి, సామరస్యాన్ని దెబ్బతీసి రాజకీయంగా లబ్ధి పొందాలనే దురుద్దేశంతోనే బీజేపీ ఏకరూప పౌరస్మృతి ఎజెండాను ముందుకు తీసుకొస్తోందని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ అబ్బాస్ విమర్శించారు. ఆవాజ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏకరూప పౌరస్మృతి ఎవరి కోసం..? అనే అంశంపై జిల్లా కార్యదర్శి మహ్మద్ గౌస్ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొమ్మిది సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం.. సమస్యల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే భావోద్వేగ సమస్యలను ముందుకు తెస్తోందని ఆరోపించారు. బీజేపీ మతోన్మాద రాజకీయాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మైనారిటీలు విద్వేష ఉచ్చులో పడకుండా జాగ్రత్తగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజకీయ విశ్లేషకుడు ఐవీ రమణారావు, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, అఖిలపక్ష పార్టీల నాయకులు ఎర్రా శ్రీకాంత్, గోకినేపల్లి వెంకటేశ్వరరావు, జితేంద్రరెడ్డి, కొండబాల కరుణాకర్, షేక్ ముక్తార్, చోటే బాబా, రెహమాన్, కనకరాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం

నేలకొండపల్లి: ఓ యువకుడు కనిపించకుండా పోయిన ఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన రావెళ్ల రాంబాబు పాల మార్కెటింగ్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. పని నిమిత్తం ఈనెల 1వ తేదీన హైదరాబాద్ వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. అదే రోజు రాత్రి భార్య ఫోన్ చేస్తే హైదరాబాద్‌లోనే ఉన్నానని చెప్పాడు. కానీ, 2వ తేదీ నుంచి ఫోన్ స్విచాఫ్ వస్తోందని కుటుంబ సభ్యులు తెలిపారు. బంధువులు, స్నేహితుల వద్ద విచారించినా ఆచూకీ దొరకలేదు. రాంబాబు భార్య నాగమణి ఫిర్యాదతో ఎస్ఐ బి.సతీశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్య చేసుకునేందుకు కాలువలో దూకి..

కూసుమంచి: ఆత్మహత్య చేసుకుందామని కాలువలో దూకి.. మర్రి ఊడను పట్టుకుని ప్రాణాలతో బయటపడ్డాడో వ్యక్తి. ఈ ఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. ఖమ్మం నగరం రేవతి సెంటర్‌కు చెందిన సంతోష్‌కుమార్ (50) అవివాహితుడు. ఈయన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఇటీవలి కాలంలో మానసిక స్థితి దెబ్బతి చనిపోవాలని నిర్ణయించుకున్నాడు. శుక్రవారం పాలేరు పరిసర ప్రాంతాల్లో అతను సంచరించినట్లు స్థానికులు తెలిపారు. శనివారం తెల్లవారుజామున ఆరు గంటల సమయంలో అతను మినీ హైడల్ ప్రాజెక్టు కాలువలోకి దూకాడు. నీటిలో మునిగి తేలేలోగా వంతెన పిల్లర్లకు ఉన్న మర్రి ఊడ చేతికి తగలగా పట్టుకుని అలాగే ఉండిపోయాడు. ఉదయం 11 గంటల ప్రాంతంలో అటుగా స్థానిక మత్స్యకారులు వెళ్తుండగా వారు కాలువలో ఉన్న అతడిని గమనించి ఒడ్డుకు చేర్చారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి వివరాలు సేకరించారు. అతడి సోదరి తనను వెతుక్కుంటూ పాలేరు రాగా అప్పటికే సంతోష్‌కుమార్‌ను మత్స్యకారులు రక్షించటంతో ఆమె తన సోదరుడిని ఇంటికి తీసుకెళ్లింది. కాగా, సంతోష్‌కుమార్ కనిపించడం లేదని ఖమ్మంలోని పోలీస్‌స్టేషన్‌లో రెండు రోజుల కిందట ఫిర్యాదు కూడా చేసినట్లు అతడి సోదరి తెలిపారు.

టీటీడీ చైర్మన్‌గా భూమన కరుణాకర్‌రెడ్డి



సాక్షి, అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి (టీటీడీ బోర్డు) చైర్మన్‌గా తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డిని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నియమించారు. ప్రస్తుతం టీటీడీ చైర్మన్‌గా ఉన్న వైవీ సుబ్బారెడ్డి, ధర్మకర్తల మండలి పదవీకాలం ఈ నెల 8వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో టీటీడీ చైర్మన్‌గా భూమనను సీఎం వైఎస్ జగన్ నియమించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను దేవాదాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్ శనివారం జారీ చేశారు. ధర్మకర్తల మండలి సభ్యులను త్వరలో నియమిస్తామని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సీఎం జగన్‌కు భూమన కృతజ్ఞతలు

తనను టీటీడీ చైర్మన్‌గా ఎంపిక చేసినందుకు సీఎం వైఎస్ జగన్‌కు భూమన కరుణాకర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డికి అత్యంత సన్నిహితుడైన భూమన కరుణాకర్‌రెడ్డి 1958, ఏప్రిల్ 5న వైఎస్సార్ జిల్లా నందలూరు మండలం ఈదరపల్లెలో జన్మించారు. ఆయన తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ నుంచి ఎంఏ పట్టా పొందారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో 2004–06 మధ్య తుడా(తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) చైర్మన్‌గా భూమన పనిచేశారు. ఆ తర్వాత 2006–08 మధ్య టీటీడీ బోర్డు చైర్మన్‌గా అత్యంత సమర్థవంతంగా పనిచేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హఠాన్మరణం తర్వాత వైఎస్ జగన్ వెంట భూమన నడిచారు. తిరుపతి శాసనసభ స్థానానికి 2012లో జరిగిన ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఘనవిజయం సాధించారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో తిరుపతి శాసనసభ స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేసి రెండోసారి విజయం సాధించారు. సభా హక్కుల కమిటీ చైర్మన్‌గా భూమన వ్యవహరిస్తున్నారు.

చంద్రబాబు ఏ1గా కేసు నమోదు చేస్తాం: వనిత

రాజమహేంద్రవరం రూరల్: పుంగనూరులో రెచ్చగొట్టేలా మాట్లాడి విధ్వంసానికి కారకుడైన ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు ఏ1గా కేసు నమోదు చేస్తామని ఏపీ హోం మంత్రి తానేటి వనిత తెలిపారు. కలెక్టరేట్ ఆవరణలో శనివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు ముందే నిర్ణయించిన షెడ్యూల్ రూట్‌లో వెళ్లకుండా, ఎందుకు పుంగనూరులోకి ప్రవేశించాల్సి వచ్చిందని ప్రశ్నించారు. ఇది శాంతి భద్రతలకు విఘాతం కల్పించాలనే కుట్రేనని అన్నారు.

పక్కా ‘ఎల్లో’ స్కెచ్

‘పచ్చ’నేతల కనుసన్నల్లోనే పుంగనూరు విధ్వంసకాండ

- పోలీసులపై దాడికి టీడీపీ ప్రత్యేకంగా వ్యూహరచన
- ముందస్తుగా రాళ్లు, మద్యం బాటిళ్ల తరలింపు
- వాహనాలు తగులబెట్టేందుకు పెట్రోల్ బాటిళ్లు సిద్ధం
- సదుం, సోమల, పులిచెర్ల నుంచి కిరాయి మూకల రాక
- రూట్‌మ్యాప్‌ను కాదని పోలీసులతో వాగ్వాదం
- ఇద్దరు డీఎస్పీలే లక్ష్యంగా పచ్చ మూకల దాడులు
- ఇలాగైనా ప్రజల్లో గుర్తింపు పొందాలని బరితెగింపు



శుక్రవారం పోలీసు వాహనాలను ధ్వంసం చేస్తున్న టీడీపీ కిరాయి మూకలు

చిత్తూరు అర్బన్: పుంగనూరు బైపాస్ రోడ్డు వద్ద విధ్వంసకాండకు టీడీపీ రెండు రోజుల ముందే వ్యూహ రచన చేసిందా? ఇందులో భాగంగానే పలు మార్లు రూట్ మ్యాప్‌ను మార్చారా? కృష్ణదేవరాయ కూడలి వద్ద ముందుగానే రాళ్లు పోగేసుకున్నారా? సమీపంలోని పంట పొలాల్లోకి ఖాళీ మద్యం సీసాలను తీసుకొచ్చి దాచారా? ఈ ప్రశ్నలన్నింటికీ అవుననే సమాధానం వినిపిస్తోంది. ఎలాగైనా సరే అల్లర్లు సృష్టించి, రాజకీయ లబ్ధి పొందాలని పన్నాగం పన్నారని స్పష్టమవుతోంది. టీడీపీ పెద్దల సూచన మేరకు కొందరు నేతలు, కార్యకర్తల కనుసన్నల్లో ఈ వ్యూహం రూపొందిందని ప్రత్యక్ష సాక్ష్యుల ద్వారా తెలుస్తోంది. ముందుగా రూపొందించిన వ్యూహం మేరకు చంద్రబాబు నాయుడు నుంచి వచ్చిన అధికారిక పర్యటన రూట్ మ్యాప్‌లో పుంగనూరు పట్టణంలో ఎలాంటి కార్యక్రమం లేదు. అయినప్పటికీ పుంగనూరు పట్టణంలోకి చంద్రబాబు రావడానికి పట్టుపట్టాలని, అందుకు పోలీసులు ఒప్పుకోరని.. అప్పుడు పోలీసులపై రాళ్లు రువ్వాలన్నది ముందస్తు వ్యూహం. ఇందులో భాగంగా ముందురోజు కొన్ని వాహనాల్లో రాళ్లను తీసుకొచ్చి కృష్ణదేవరాయల కూడలి సమీపంలో అక్కడక్కడ పోసి ఉంచారు. బార్లు, మద్యం షాపుల నుంచి ఖాళీ బీరు సీసాలు, మద్యం బాటిళ్లను తీసుకొచ్చి సమీపంలోని పొలం వద్ద దాచారు. పరిస్థితిని బట్టి ఉపయోగించాలని కొన్ని బాటిళ్లలో పెట్రోల్ నింపుకొచ్చి అక్కడ ఉంచారు. చంద్రబాబు నాయుడుకు స్వాగతం పలికేందుకు తీసుకొచ్చిన 50కి పైగా పెద్ద సైజు పేలుడు పదార్థాల ఉండలను (బాంబుల్లాంటివి) ఓ ప్రదేశంలో దాచారు. శుక్రవారం సదుం, పులిచెర్ల, సోమల మండలాల నుంచి పలువురిని కిరాయికి తీసుకొచ్చి జన సమూహంలో కలిపేశారు. అంగళ్లలో చంద్రబాబు ఎప్పుడైతే రెచ్చగొట్టే ప్రసంగం చేస్తూ.. ‘పదండి పుంగనూరుకు.. ఆ పుడింగి సంగతి తేలుద్దాం’ అని పిలుపునిచ్చారో ఆ తర్వాత కూడా పలువురు టీడీపీ నేతలు మదనపల్లి నుంచి వస్తూ వస్తూ వారి వాహనాల్లో ఖాళీ మద్యం బాటిళ్లు, రాళ్లు, కర్రలు వేసుకుని వచ్చారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల తర్వాత స్థానిక టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా బాబు బైపాస్ రోడ్డు వద్దకు చేరుకుని, చంద్రబాబును పట్టణంలోకి అనుమతించాలని పట్టుపట్టారు. జెడ్ ప్లస్ సెక్యూరిటీ ఉన్న ప్రతిపక్ష నేత పర్యటనను ఎలా పడితే అలా ఉన్నట్లుండి మార్చడం కుదరదని పోలీసులు చెప్పినా వినిపించుకోలేదు. దీంతో కార్యకర్తల్ని చల్లా బాబు రెచ్చగొట్టాడు.

బాటిళ్లు, చెప్పులతో దాడి

చల్లా బాబు మాటలతో రెచ్చిపోయిన కార్యకర్తలు.. ఇద్దరు డీఎస్పీలను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడ్డారు. గతేడాది కుప్పంలో చంద్రబాబు నాయుడు పర్యటనలో ప్రసంగాలకు ముందస్తు అనుమతిలేదని పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, చిత్తూరు దిశ పోలీస్ స్టేషన్ డీఎస్పీ బాబుప్రసాద్ నోటీసులు జారీ చేశారు. ‘నాకే నోటీసులు ఇచ్చే ధైర్యమా? మీ కథ చూస్తా’ అంటూ అప్పుడు చంద్రబాబు సైతం డీఎస్పీలకు హెచ్చరికలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఈ ఇద్దరు డీఎస్పీలను లక్ష్యంగా చేసుకున్న టీడీపీ శ్రేణులు తొలుత ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, చెప్పులను పోలీసులపైకి విసిరారు. ఇది పద్ధతికాదని పోలీసు అధికారులు నచ్చజెపుతుండగానే ఒక్కసారిగా పక్కనే ఉన్న రాళ్లు విసురుతూ విరుచుకుపడ్డారు. పోలీసులు తేరుకునేలోపే టీడీపీ నేతలు తీసుకొచ్చిన కిరాయి కార్యకర్తలు వందల సంఖ్యలో రాళ్లు, మద్యం బాటిళ్ల వర్షాన్ని కురిపించారు. దీంతో పరిస్థితి అదుపుతప్పింది.

పోలీసులు బతిమాలినా వదల్లేదు

కొందరు పోలీసులు వద్దని బతిమిలాడుతుంటే వాళ్లను వ్యాను పక్కకు లాక్కెళ్లి పోలీసు లాఠీలు లాక్కుని మరీ చావ బాదారు. టపాకాయ బాంబులను పోలీసులపై విసురుతుంటే ఏం జరుగుతుందో కూడా తెలియని స్థితిలో తమను తాము కాపాడుకునే ప్రయత్నంలో చేతిలో ఉన్న ప్లాస్టిక్ గార్డులను అడ్డుగా పెట్టారు. రాళ్ల దెబ్బకు అవన్నీ ధ్వంసమయ్యాయి. అంతటితో ఆగక పోలీసుల వాహనాలపైకి టపాకాయ బాంబులు విసురుతూ.. ముందుగా తెచ్చుకున్న పెట్రోల్‌ను వాటిపై పోసి నిప్పంటించారు. రాళ్ల దెబ్బలతో రక్తమోడుతున్న పోలీసులను చూసి మానవత్వం లేకుండా దాదాపు 40 నిమిషాల పాటు ఏకధాటిగా రాళ్లు, బాటిళ్లను విసురుతూ పచ్చ మూకలు పైశాచిక ఆనందం పొందాయి.

కీలకపాత్రధారి చల్లా బాబు

మీడియాతో డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ రిషాంత్

పుంగనూరులో జరిగిన అల్లర్లు, పోలీసులపై దాడులు మొత్తం ముందస్తు ప్లాన్ ప్రకారం జరిగినవేనని రాయలసీమ డీఐజీ అమ్మిరెడ్డి, చిత్తూరు ఎస్పీ రిషాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం చిత్తూరులోని పోలీసు అతిథి గృహంలో వారు మీడియాతో మాట్లాడారు. పుంగనూరులో టీడీపీ మూకలు పోలీసులపై ఎలా దాడులకు పాల్పడ్డాయో వీడియో ద్వారా చూపించారు. కొన్నిచోట్ల పోలీసులు బతిమాలుతున్నా వినిపించుకోకుండా, వాళ్ల లాఠీలు లాక్కుని పోలీసుల్నే కొట్టారని చెప్పారు. వాహనాలపైకి టపాకాయ బాంబులు వేయడంతోపాటు, పెట్రోల్ పోసి నిప్పంటించారని చెప్పారు. అసలు చంద్రబాబు నాయుడు ఇచ్చిన షెడ్యూల్ మేరకు పుంగనూరు పట్టణంలో ఆయన పర్యటనే లేదని, స్థానిక టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా బాబు ఉద్దేశ పూర్వకంగా ప్లాన్ చేసి గొడవలు సృష్టించారన్నారు. బాబును పుంగనూరులోకి అనుమతించాలని పార్టీ శ్రేణులను రెచ్చగొట్టి పోలీసులపై దాడులు చేయించారని చెప్పారు. ప్రజల ప్రాణ, మాన, ఆస్తులను కాపాడడమే లక్ష్యంగా పోలీసులు ధైర్యంగా నిలబడి అల్లరి మూకలు పుంగనూరులోకి ప్రవేశించకుండా అడ్డుగా నిలబడ్డారని తెలిపారు. దెబ్బలు తగిలి రక్తం కారుతున్న వేళ, పోలీసుల వద్ద ఆయుధాలు ఉన్నప్పటికీ సంయమనం పాటించారన్నారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పోలీసులు విధులు నిర్వర్తించి ధైర్య సాహసాలు ప్రదర్శించారని ప్రశంసించారు. ఈ దాడుల్లో పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా బాబు కీలక పాత్రధారిగా కేసు నమోదు చేశామన్నారు. విధుల్లో ఉన్న పోలీసులను చంపాలని చూడడం, పోలీసు వాహనాలు ధ్వంసం చేయడం తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని చెప్పారు. ప్రస్తుతం 40 మందిని అరెస్టు చేశామని, మరికొందరిని అరెస్టు చేయాల్సి ఉందన్నారు.

చివరకు చిల్లర గొడవలే దిక్కా!?

ముందస్తు మేనిఫెస్టో, లోకేశ్ పాదయాత్ర.. ఇలా ఎన్ని ప్రయత్నాలు చేసినా టీడీపీ తేరుకునే అవకాశాలు లేకపోవడంతో చంద్రబాబు చివరకు తనకు అలవాటైన ఘర్షణలనే నమ్ముకున్నారని పుంగనూరు ఘటన స్పష్టం చేస్తోంది. ప్రజాదరణ లేదని తేలిపోవడంతో రోడ్‌షోలతో వీధి గొడవలకు దిగుతున్నారు. ప్రాజెక్టుల సందర్శన ముసుగులో పర్యటిస్తున్న చంద్రబాబు అసలు ఆ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. అంతిమ లక్ష్యం రెచ్చగొట్టి ఘర్షణలకు పురిగొల్పడమేనని స్పష్టమవుతోంది. తన పర్యటనలను యుద్ధభేరిగా మార్చుకోవటాన్ని బట్టే వాస్తవాలు బహిర్గతమవుతున్నాయి. ఇందులో భాగంగానే రాయలసీమలో గొడవలు సృష్టించేందుకు ఒక పథకం ప్రకారం చంద్రబాబు పర్యటనల ద్వారా డిజైన్ చేసినట్లు స్పష్టమవుతోంది. తొలుత పులివెందులలో కూడా ఇలానే రెచ్చగొట్టి గొడవ సృష్టించడానికి విఫలయత్నం చేయడం తెలిసిందే. వాస్తవానికి పులివెందులలో టీడీపీకి దిక్కులేదు. అందుకే కిరాయి జనంతో రోడ్‌షో నిర్వహించి హడావుడి చేశారు. అనుకున్న లక్ష్యం నెరవేరక పుంగనూరుపై దృష్టి సారించి, గొడవ సృష్టించడంలో సఫలమయ్యారు.

‘ఈనాడు’ నైజం బట్టబయలు

వైఎస్సార్‌సీపీ నాయకుడికి టీడీపీ ముసుగేసిన వైనం



కురబలకోట: చంద్రబాబు రెచ్చగొట్టే వ్యాఖ్యలతో చోటుచేసుకున్న గొడవలో శుక్రవారం కురబలకోట మండలంలోని అంగళ్లుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు అర్జున్‌రెడ్డి టీడీపీ దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. అయితే శనివారం ఈనాడు దిన పత్రిక పతాక శీర్షికలో అర్జున్ రెడ్డిని టీడీపీ కార్యకర్తగా పేర్కొంటూ ఫొటో ప్రచురించింది. రక్తమోడుతున్న టీడీపీ కార్యకర్త అని ప్రచారం చేసింది. దాడిలో దెబ్బలు తిన్నది వైఎస్సార్‌సీపీ నాయకుడైతే నిస్సిగ్గుగా టీడీపీ కార్యకర్త అని దుష్ప్రచారం చేయడం ఈనాడు రామోజీకే చెల్లిందని అంగళ్లు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై బాధితుడు అర్జున్ రెడ్డి మాట్లాడుతూ తనను టీడీపీ కార్యకర్తగా ప్రచురించడం ఈనాడు తన ‘పచ్చ’పాతాన్ని చాటుకుందన్నారు. తాను తొలి నుండి వైఎస్సార్‌సీపీ వీరాభిమానినన్నారు. కాగా, శనివారం అర్జున్‌రెడ్డిని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు.

కఠిన చర్యలు తప్పవు: డీజీపీ

సాక్షి, అమరావతి: పుంగనూరు ఘటనపై విచారణకు ఆదేశించామని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన వారందరిపై కఠిన చర్యలు తప్పవని డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి హెచ్చరించారు. ఘటన పూర్వాపరాలపై విచారణ జరపాలని డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ రిషాంత్‌లను ఆదేశించామన్నారు. ఈ విషయమై శనివారం ఆయన సాక్షితో మాట్లాడుతూ.. చంద్రబాబు పర్యటన సందర్భంగా టీడీపీ కార్యకర్తలు చేసిన దాడిలో పోలీసులు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. అక్కడ వాహనాలను సైతం టీడీపీ కార్యకర్తలు ఉద్దేశపూర్వకంగా తగులబెట్టారని చెప్పారు. రాళ్లు రువ్విన, నిప్పు పెట్టిన వారందరినీ గుర్తించామన్నారు. ఘటన స్థలిలో సీసీ కెమెరా ఫుటేజీలను విశ్లేషిస్తున్నామని, ఇప్పటికే పలువురిని గుర్తించామని.. మరికొందరు అనుమానితుల కదలికలపై నిఘా పెట్టామని తెలిపారు. చంద్రబాబు రూట్ ప్లాన్ మార్పు వ్యవహారం కూడా విచారణలో తేలుతుందన్నారు. చంద్రబాబు చేసిన రెచ్చగొట్టే ప్రసంగాలపై కూడా దృష్టి పెట్టామని చెప్పారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే సహించేది లేదని పునరుద్ఘాటించారు.

జిల్లా వార్తలు

ఆయిల్‌పామ్‌తో అనేక లాభాలు



మాట్లాడుతున్న వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు

అశ్వారావుపేటరూరల్: ఆయిల్‌పామ్ తోటల సాగుతో లాభాలు పొంది సన్న, చిన్నకారు రైతులు ఆర్థికంగా బలోపేతం కావచ్చని వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ ఐవీఎస్ రెడ్డి, డాక్టర్ గోపాలకృష్ణమూర్తి, డాక్టర్ రాంప్రసాద్ అన్నారు. మండలంలోని నారాయణపురం రైతు వేదికలో శనివారం ఆయిల్‌పామ్ తోటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తోటల సాగు, మేలైన యాజమాన్య పద్ధతులు, సుస్థిరమైన దిగుబడులపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, సబ్సిడీల గురించి వివరించారు. ఈ ఏడాది పామాయిల్ మొక్కల కొరత లేదని, స్థానిక ఆయిల్‌ఫెడ్ నర్సరీల్లోనే రైతులకు అవసరమైన మొక్కలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. సమావేశంలో సొసైటీ చైర్మన్ నిర్మల పుల్లారావు, ఏఈఓ ఎస్‌కే షాకిరా భాను, చిన్నంశెట్టి వెంకట నరసింహ, ఆకుల శ్రీను, నులకాని శ్రీను పాల్గొన్నారు.

పామాయిల్ సాగు లక్ష్యాన్ని చేరాలి



మాట్లాడుతున్న ఆయిల్‌ఫెడ్ డీఓ బాలకృష్ణ

అశ్వారావుపేటరూరల్: ఉమ్మడి జిల్లాలో వానాకాలం సీజన్‌లో నిర్దేశించిన పామాయిల్ తోటల సాగు లక్ష్యాన్ని చేరుకోవాలని ఆయిల్ ఫెడ్ డివిజనల్ అధికారి ఎ.బాలకృష్ణ సూచించారు. మండలంలోని నారంవారిగూడెం కార్యాలయంలో శనివారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల క్షేత్రస్థాయి సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పామాయిల్ మొక్కలు పుష్కలంగా ఉన్న నేపథ్యంలో రైతుల వద్దకు వెళ్లి తోటల సాగు, ప్రభుత్వం అందించే సబ్సిడీ గురించి వివరించాలని సూచించారు. సాగులో ఉన్న రైతులు పక్వానికి వచ్చిన గెలలను మాత్రమే ఫ్యాక్టరీలకు తరలించేలా అవగాహన కల్పించాలన్నారు. పోడు పట్టాలు పొందిన రైతులు కూడా సబ్సిడీలు వర్తిస్తాయని తెలిపారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లాలోని ఆయిల్‌ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మూడేళ్లుగా ఉలుకూ.. పలుకూ లేదు

- పాఠశాలల క్రీడా క్యాలెండర్‌పై మొదలుకాని కార్యాచరణ
- ఔత్సాహికుల ఆశలన్నీ ఆవిరవుతున్న వైనం
- క్రీడల నిర్వహణకు నిధులు కేటాయింపు శూన్యం
- నామమాత్రంగానే జిల్లా విద్యాశాఖ తీరు
- సత్వర చర్యలు తీసుకోవాలని వేడుకోలు



కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు (ఫైల్)

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లాలో పాఠశాలల క్రీడలు మూడేళ్లుగా జరగపోయిన ఇప్పటి వరకు ఎలాంటి కార్యాచరణను రూపొందించపోవడం పట్ల పాఠశాలల క్రీడాకారులు ఆందోళన చెందుతున్నారు. ఈసారైన పాఠశాలల క్రీడలు సజావుగా జరిగే విధంగా విద్యాశాఖ చర్యలు తీసుకుంటుందా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నారు. అయితే ఇప్పటికే జాతీయ క్రీడలకు సంబంధించిన క్రీడల క్యాలెండర్ విడుదలైన జిల్లాలో మాత్రం ఇంకా దీనికి సంబంధించిన ప్రణాళికలను తయారు చేయకపోవడం పట్ల క్రీడాకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలల క్రీడల్లో అండర్–14, 17, 19 విభాగాల్లో బాలబాలికలు జిల్లా నుంచి కనీసం 300 మందికి పైగా క్రీడాకారులు జాతీయస్థాయి వివిధ కేటగిరిల్లో పాల్గొంటారు. పాల్గొన్న క్రీడాకారుల సర్టిఫికెట్లు జాతీయస్థాయివి కావడంతో వివిధ ఉన్నత చదువుల్లో స్పోర్ట్స్ కోటా ద్వారా భర్తీ చేసే అవకాశాలున్నాయి. ఈసారైన జాతీయస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించిన ఉన్నత చదువుల్లో స్పోర్ట్స్ కోటా సీటు పొందాలని ఆశలు పడుతున్న క్రీడాకారులకు నిరాశను మిగులుస్తోంది. కాగా, విద్యాశాఖ అధికారులు కూడా ఈ అంశంపై పునరాలోచించి జిల్లాస్థాయిలో క్రీడా పోటీలను నిర్వహిస్తే బాగుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రశ్నార్థకంగానే నిధులు మంజూరు..

జిల్లాలోని పాఠశాలల క్రీడల నిర్వహణకు జిల్లా విద్యాశాఖ నిధులు మంజూరు చేసిన దాఖలాలే లేవు. కాని జిల్లాలోని ప్రతి పాఠశాల విద్యార్థి నుంచి రూ.3 వసూలు చేయాలనే నిబంధనను ఇప్పటి వరకు అమలుపరుస్తున్నారు. కాగా, జిల్లాను రెండుగా విభజించడంతో విద్యార్థుల నుంచి వసూలు చేసిన నిధులు ఏవిధంగా సరిపోతాయనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అయితే డీసీసీఈబీ(ఉమ్మడి పరీక్షల విభాగం) ద్వారా పైనిధులను తీసుకునే ఆనవాయితీ ఉంది. ఈ నిధులు సరిపోవని జిల్లా విద్యాశాఖ జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన క్రీడాకారుల కిట్లు, రవాణా చార్జీలు ఇవ్వకపోవడంతో క్రీడాకారులు నష్టపోవాల్సి వస్తుందనే ఆరోపణలున్నాయి. కాగా, క్రీడాకారులకు నష్టపోకూడదనే భావించిన కొంతమంది జిల్లా పాఠశాలల క్రీడల కార్యదర్శులు తమ సొంత డబ్బులు వెచ్చించాల్సి వస్తోంది. దీంతో విద్యలో అంతర్భాగంగా నిలిచే క్రీడలను ప్రోత్సాహించకపోవడం సమంజసం కాదని సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు విద్యాశాఖ తీరుపై మండిపడుతున్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉందని.. దీనిని అధిగమించేందుకు సత్వర చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

క్రీడా పోటీలపై సందిగ్ధం..

జిల్లా, మండల, జోన్‌స్థాయిలో నిర్వహించే క్రీడా పోటీలపై ఇంతవరకు ఎలాంటి కార్యాచరణను రూపొందించకపోవడం పట్ల వ్యాయామ ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ముందుగా మండలస్థాయిలో తర్వాత జోన్‌స్థాయిలో క్రీడా పోటీలను జరిపేవారు. కాగా గతంలో నిర్వహించిన మాదిరిగానే ఈపోటీలను నిర్వహిస్తే బాగుంటుందని సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు. అంతేగాక ప్రతిఏటా పాఠశాలల క్రీడలను కేవలం నాకౌట్ పద్ధతిలో పోటీలు జరిపే విధంగా చర్యలు తీసుకుంటే జిల్లాలో ప్రతిభ కలిగిన జట్లు కూడా ఒక్కోసారి ఓడిపోతున్నాయని.. దీన్ని దృష్టిలో ఉంచుకొని లీగ్ కం నాకౌట్ పద్ధతిలో జరిపే విధంగా చర్యలు తీసుకుంటే బాగుంటుందని పీఈటీలు కోరుతున్నారు.

గ్రానైట్ పరిశ్రమలకు బకాయిలు విడుదల

ఆదుకున్నందుకు ధన్యవాదాలు : ఎంపీ రవిచంద్ర

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం గ్రానైట్ పరిశ్రమలకు ప్రభుత్వం బకాయి ఉన్న పలు సబ్సిడీలను శనివారం విడుదల చేసింది. ఇండస్ట్రీస్ ఇన్సెంటివ్, పవర్ సబ్సిడీ, పావలా వడ్డీ బకాయిలు కలిపి.. రూ. 22 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గ్రానైట్ పరిశ్రమకు 2014 నుంచి పలు రకాల రాయితీ బకాయిలు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని విడుదల చేసి పరిశ్రమను ఆదుకోవాలని ఖమ్మం గ్రానైట్ అసోసియేషన్ ప్రతినిధులు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర నేతృత్వంలో పలుమార్లు సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, పువ్వాడ అజయ్‌కుమార్‌లకు వినతిపత్రాలు అందించారు.



వద్దిరాజు రవిచంద్ర

ఈ ఏడాది జనవరి 18న ఖమ్మంలో బీఆర్‌ఎస్ ఆవిర్భావ బహిరంగ సభ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి హరీష్ రావును కలిసి సమస్య తీవ్రతను తెలియజేశారు. ఆ మేరకు బకాయిల మొత్తంలో రూ. 22 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

రుణపడి ఉంటాము

గ్రానైట్ పరిశ్రమకు ప్రభుత్వం బకాయిలు విడుదల చేయడంతో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర హర్షం వ్యక్తం చేశారు. ఖమ్మం గ్రానైట్ కుటుంబ సభ్యులంతా సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటారని అన్నారు. తెలంగాణలో అతి ముఖ్యమైన గ్రానైట్ పరిశ్రమను ఆదుకోవాలని కోరగా సీఎం కేసీఆర్ స్పందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, పువ్వాడ అజయ్ కుమార్ పరిశ్రమను ఆదుకోవడంలో అండగా నిలిచారని, వారితో పాటు సహకరించిన జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలకు రవిచంద్ర ధన్యవాదాలు తెలిపారు.

గిరిజనాభివృద్ధికి కృషి చేస్తా

ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్

భద్రాచలం: లోతైన అధ్యయనం ద్వారా గిరిజనాభివృద్ధికి కృషి చేస్తానని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ అన్నారు. భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గ్రామాల్లో ఉన్న గిరిజనుల చెంతకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సులభంగా చేరేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఐటీడీఏలోని తన చాంబర్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నూతనంగా పీఓ బాధ్యతలు స్వీకరించిన అనంతరం కొన్ని ఆశ్రమ పాఠశాలను సందర్శించి కొందరు పిల్లల్లో బేసిక్స్, నైపుణ్యాల కొరత ఉందని గుర్తించినట్లు తెలిపారు. ఇందుకోసం రంగారెడ్డి జిల్లాలోని కొన్ని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో విద్యార్థులకు శిక్షణ ఇప్పించనున్నట్లు తెలిపారు. రెండు రోజుల్లో శిక్షణ ప్రారంభమవుతుందని, దీని ద్వారా ఇంగ్లిష్, తెలుగు, గణితం, సైన్స్ సబ్జెక్ట్‌లలో జ్ఞానం పెంపొందించవచ్చని పేర్కొన్నారు. పిల్లలకు ప్రతినెలా పరీక్షలను నిర్వహించి, వారి ప్రతిభాపాటవాల ఆధారంగా ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రధానంగా విద్యాలయాల్లో సెలవుల సంఖ్యను తగ్గించి ఎక్కువ పనిదినాలు విద్యార్థులకు సద్వినియోగం అయ్యేలా ప్రణాళికలను రూపొందించాలన్నారు.



ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్

ఖాళీగా ఉన్న గురుకులం ఆర్‌సీఓ పోస్టుకు రెగ్యులర్ అధికారి వస్తున్నారని తెలిపారు. ఖాళీగా ఉన్న యూనిట్ అధికారుల పోస్టుల భర్తీకి, భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టుల భర్తీకి కృషి చేస్తానని వివరించారు. ఈ నెల 9న ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. భద్రాచలం, సారపాక గ్రామపంచాయతీలు, మణుగూరు మున్సిపాలిటీలకు స్పెషలాఫీసర్‌గా నియమించారని తెలిపారు. ‘విత్ ఎడ్యుకేషన్ బికమ్ చేంజ్ యువర్ లైఫ్’అనే సిద్ధాంతాన్ని తాను పాటించానని, నేటి యువత సైతం దీనిని పాటిస్తే భవిష్యత్ బంగారుమయంగా ఉంటుందని పీఓ సూచించారు. ఇటీవల ఐటీడీఏ పరిధిలోని స్కూళ్లలో పదో తరగతి ఫలితాలపై సమీక్ష చేపట్టామని తెలిపారు. 80 శాతం కంటే తక్కువ ఫలితాలు వచ్చిన పాఠశాల హెచ్‌ఎంలు 21 మందికి, సబ్జెక్ట్ టీచర్లు 27 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేశామని పేర్కొన్నారు.

ఉత్సాహంగా న్యాయవాదుల క్రికెట్ పోటీలు

ఖమ్మంలీగల్: ఈనెల 15న స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మం బార్ అసోసియేషన్ క్రీడల కార్యదర్శి రావుల వెంకట్ ఆధ్వర్యంలో శనివారం సర్దార్ పటేల్ స్టేడియంలో న్యాయవాదులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ఎస్.జగ్జీవన్‌కుమార్.. ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయమూర్తి డి.రాంప్రసాద్‌రావు, న్యాయసేవాసంస్థ కార్యదర్శి జావీద్‌పాషాతో కలిసి పోటీలను ప్రారంభించారు. జిల్లా న్యాయసేవా ఉద్యోగుల సంఘం జట్టు కెప్టెన్‌గా జిల్లా జడ్జి, న్యాయవాదుల సంఘం జట్టు కెప్టెన్‌గా అధ్యక్షుడు కృష్ణారావు వ్యవహరించారు. ఈ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో న్యాయవాదుల జట్టు విజయం సాధించింది. నిర్ణీత 10 ఓవర్లలో న్యాయవాదుల జట్టు 92 పరుగులు చేయగా లక్ష్య సాధనలో జిల్లా జడ్జి జట్టు ఓటమి పాలైంది. అనంతరం న్యాయవాదులు గరికె సంపత్ జట్టు, జ్ఞానేష్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ రసవత్తరంగా సాగి.. డ్రాగా ముగిసింది. ఆర్గనైజర్స్‌గా బిల్లా శ్రీను, దిలీప్ వ్యవహరించగా బార్ బాధ్యులు లక్ష్మీనారాయణ, ప్రవీణ్, దిలీప్ పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న బార్ అధ్యక్షుడు కృష్ణారావు

జాతీయ స్థాయి గుర్తింపు అభినందనీయం

అకడమిక్ గైడ్స్ అధికారి డి.టి.చారి

ఖమ్మం సహకారనగర్ : ఖమ్మంలోని ఎస్‌ఆర్‌అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలకు జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో ప్రత్యేక గుర్తింపు లభించడం అభినందనీయమని అకడమిక్ గైడ్స్ అధికారి డాక్టర్ డి.టి.చారి అన్నారు. ఇటీవల న్యాక్ ఏ ప్లస్ ప్లస్ (3.64 సీజీపీఏ పాయింట్స్) సాధించిన కళాశాలను శనివారం ఆయన సందర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జాకిరుల్లా, ఐక్యూఏసీ విభాగంతో పాటు ఇతర విభాగాల అధ్యాపకులకు సన్మానించారు. అనంతరం కళాశాల అధ్యాపకులను అభినందిస్తూ తెలంగాణ ఉన్నత విద్య కార్యదర్శి వాకాటి కరుణ పంపిన సందేశాన్ని అందించారు కార్యక్రమంలో ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ రమాసత్యవతి, సభ్యులు సీహెచ్.శ్రీనివాసులు, ఎస్.రమేష్, డి.శ్రీనివాస్, సునంద, ఎం.అనురాధ, వేలాద్రి, ఉషాపావని, వి.స్వప్న, గులాబ్‌సింగ్, కేవీఆర్‌కే దుర్గ, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.



కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులతో డీటీ చారి